నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I హైదరాబాద్, బుధవారం 13 నవంబర్ 2024 SANGAREDDY



సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో రైస్‌మిల్లు వద్ద ధాన్యం లోడుతో ఆగి ఉన్న లారీలు

## మిల్లర్లు సన్నాలు కొంటలేరు

**సంగారెడ్డి అదనపు కలెక్టర్‌కు ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతుల మొర**



సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మాధురి

గుమ్మడిదల, నవంబర్ 12: రైస్‌మిల్లర్లు సన్న ధాన్యాన్ని కొంటలేరని ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల, నల్లవల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సన్నధాన్యాన్ని రైస్‌మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు అదనపు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మిల్లర్లు సన్నధాన్యం కొనుగోలు చేసేవిధంగా వారితో మాట్లాడాలని తహసీల్దార్ గంగాభవానీకి సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో సన్న వడ్లు, దొడ్డువడ్లు ఎన్ని వస్తున్నాయో రికార్డులను పరిశీలించారు. ధాన్యంలో తాలు లేకుండా జల్లెడ పట్టాలని ఆమె రైతులకు సూచించారు.17శాతం తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని ఆదేశించారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తామని తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఏవో శ్రీనివాస్‌రావు, ఏఈవో నిఖిత, పీఏసీఎస్ సీఈవో లచ్చిరామ్, రైతులు ఉన్నారు.

## సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి



గజ్వేల్ మండలం జాలిగామలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, నవంబర్ 12: సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి జాప్యం రానివ్వొద్దని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ సమీపంలోని మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలపై మార్కెటింగ్ అధికారుల పర్యవేక్షణ ఉండాలని, అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. కొనుగోలు చేసిన తర్వాత సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలని, అందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. తేమ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఆరు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించుకున్నామని, కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పత్తిని విక్రయించాలన్నారు. క్వింటాల్ పత్తికి ప్రభుత్వం రూ.7521 మద్దతు ధర నిర్ణయించిందని, దళారులకు అమ్ముకొని నష్టపోవద్దన్నారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కార్యదర్శి జాన్‌వెస్లీ, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, సూపర్‌వైజర్ మహిపాల్, కేశిరెడ్డి రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## చేప పిల్లల సంఖ్య తగ్గింది



మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని రాయారావు చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, నవంబర్ 12: బీఆర్‌ఎస్ హయాంలో కంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో చెరువులో వదిలే చేప పిల్లల సంఖ్య తగ్గిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని రాయారావు చెరువులో ఆమె చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో నర్సాపూర్ పట్టణంలోని రాయారావు చెరువులో 2 లక్షల 60 వేల చేప పిల్లలను వదిలితే ఈసారి 66 వేల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని 24 చెరువుల్లో 19 లక్షల 10 వేల చేప పిల్లలను వదలడం జరుగుతుందన్నారు. చేపల పెంపకంతో మత్స్యకారులకు లాభం చేకూరేలా ప్రభుత్వం చూడాలని సూచించారు. కొత్త వ్యక్తులకు సభ్యత్వం ఇచ్చి వారికి మెంబర్ షిప్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా మత్స్యశాఖ ఏడీ మల్లేశం, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు షేక్‌హుస్సేన్, ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వినయ్, సద్దాం, సలీం, ఇర్ఫాన్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

### మత్స్యశాఖ ఏడీపై మండిపడ్డ ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మెదక్ జిల్లా మత్స్యశాఖ ఏడీ మల్లేశంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని రాయారావు చెరువులో చేప పిల్లలు వదిలే కార్యక్రమాన్ని మత్స్యశాఖ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా రాయారావు చెరువు వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా దానిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ఫొటో కంటే ఎమ్మెల్యే ఫొటో చిన్నగా వేయించారు. దీనికి ఆగ్రహించిన బీఆర్‌ఎస్ శ్రేణులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయంపై ఏడీ మల్లేశాన్ని పిలిపించిన ఆమె ప్రొటోకాల్ తెలియదా అంటూ మండిపడ్డారు. ఈ విషయంలో తప్పిదం జరిగిందని, క్షమించాలని ఎమ్మెల్యేని మత్స్యశాఖ అధికారులు వేడుకున్నారు. ఇంకోసారి ఇలాంటి తప్పిదం జరగకుండా చూసుకోవాలని వారిని హెచ్చరించారు. చేప పిల్లలు వదిలే కార్యక్రమం ప్రారంభం కాకముందే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

**కొనుగోలు కేంద్రాల్లో వేధిస్తున్న సమస్యలు.. ఇబ్బందుల్లో రైతులు**



సిద్దిపేట వ్యవసాయ మార్కెట్‌లో చినిగిన ధాన్యం బస్తా

- చినిగిపోయిన గన్నీబ్యాగులు.. తేమ, తాలుశాతం పేరిట కోతలు
- కొనుగోలు చేసినా లారీలు రాక కేంద్రాల్లోనే ధాన్యం.
- మిల్లుల వద్ద అన్‌లోడింగ్ కాక లారీలు రోజుల తరబడి అక్కడే
- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా లోడింగ్ అన్‌లోడింగ్ సమస్యలు
- ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- అధికారులతో వ్యాపారుల కుమ్మక్కు.. కొనుగోలు కేంద్రాల్లోనే కాంటాలు



సిద్దిపేటలోని రైస్‌మిల్లు ఎదుట ధాన్యం లోడుతో ఉన్న ట్రాక్టర్లు

ఉమ్మడి మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నెమ్మదించాయి. ఏదో కొంటున్నామా..? అంటే కొంటున్నాం ..అన్నట్లుగా కొనుగోలు కేంద్రాలను నడిపిస్తున్నారు. పేరుకు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. కానీ అన్నీ సమస్యలే రాజ్యమేలుతున్నాయి. రైతులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. చినిగిపోయిన గన్నీబ్యాగులు ఇస్తున్నారు. వాటిలో ధాన్యం ఇటు పోస్తే అటు పోతున్నది. తేమ శాతం మిషన్ సక్రమంగా ఉండదు, టార్పాలిన్ కవర్లు, తాలు పట్టే యంత్రాలు ఉండటం లేదు. తూకం వేసిన ధాన్యం తరలించడానికి వారం రోజులకు పైగానే పడుతుందని రైతులు చెబుతున్నారు. ఆయా కేంద్రాల్లో తూకంలో తేడాలు ఉన్నాయి. తాలు, తేమ తదితర వాటి పేరు మీద ఎక్కువ కాంటా చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. దొడ్డు రకం ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులు రూ. 1900 నుంచి 2100, సన్నరకం ధాన్యాన్ని రూ2400 నుంచి రూ.2500 వరకు కొనుగోలు చేస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో సన్న రకం ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో రైతులు దళారులకు అమ్ముతున్నారు.

**పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు**

సిద్దిపేట, నవంబర్ 12( నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఆరుగాలం కష్టించి పంట పండించిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో తిప్పలు తప్పడం లేదు. పంట పండించడం ఒక ఎత్తు అయితే ఆ పంటను అమ్ముకోవడానికి రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తున్నది. కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మినా లారీల లోడింగ్ ఓ సమస్యగా మారింది. కాంటా అయిన ధాన్యం తరలించకపోవడంతో అక్కడే రైతులు కాపలా కాయాల్సి వస్తున్నది. కేంద్రాల నుంచి ధాన్యం పోయినా మిల్లుల వద్ద లారీలు రోజుల తరబడి అన్‌లోడింగ్ కాకపోవడంతో సమస్య మరింత జఠిలమవుతున్నది. వీటన్నింటి మధ్యన చేసేది ఏం లేక రైతులు అడ్డికి పావుశేరు చొప్పున ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. కనీసం జిల్లా మంత్రులు కొనుగోలు తీరుపై సమీక్షలు చేయడం లేదు. మండలాల వారీగా ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేదు. ఇప్పటికే దళారులు 40 శాతానికి పైగా ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

**అధికారుల లెక్కలు ఇలా..**

ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఆశించిన మేరకు ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదు .క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులకు అధికారులు చెబుతున్న వాటికి పొంతన లేకుండా పోతున్నది. ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం అని చెబుతున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. సిద్దిపేట జిల్లాలో 419 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆ మేరకు జిల్లాలో ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు చెబుతున్న కొనుగోలు కేంద్రాల్లో అనుకున్న స్థాయిలో కొనుగోళ్లు జరగడం లేదు. రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. తూకం, సంచులు, తేమ, సన్నరకం, దొడ్డురకం తదితర సమస్యలు ఉన్నాయి. ఎక్కువ శాతం రైతులు ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తీసుకుపోయి మిల్లులకు అమ్ముతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 25,486 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. దీని విలువ రూ. 59.13 కోట్లు కాగా ఇప్పటి వరకు రైతులకు రూ. 13.69 కోట్లు చెల్లించింది. ఈ జిల్లాలో 40 శాతానికి పైగా ధాన్యాన్ని రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నారు. మెదక్ జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుదని అంచనా వేసిన అధికారులు ఆలెక్కన జిల్లాలో ఇప్పటి వరకు సన్నరకానికి సంబంధించిన కొనుగోలు కేంద్రాలు 92, దొడ్డు రకం కొనుగోలు కేంద్రాలు 397 మొత్తం జిల్లాలో 489 కేంద్రాల్లో ధాన్యం సేకరణ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 31,529 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మిల్లులకు 19,244 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తరలించారు. రైతులకు చెల్లించిన డబ్బులు కేవలం 31 మందికి రూ. 25 లక్షలు మాత్రమే...జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యం చేరుకోవాలంటే 3.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలి. వీటిలో ఇప్పటికే ప్రైవేట్ వ్యాపారులకు రైతులు అమ్ముకున్నారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం కొనుగోలు కేంద్రాలు 214 అని ప్రతిపాదించారు. వీటిలో దొడ్డురకం 188 కేంద్రాలు, సన్నరకం 28 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 18,875 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ధాన్యం విలువ రూ.43.33 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ10.71 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. 9,716 మెట్రిక్ టన్నుల ధాన్యం ట్యాబ్‌లో ఎంట్రీ అయ్యింది.

**కేంద్రాల్లో వేధిస్తున్న సమస్యలు**

ధాన్యం సేకరణలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఒక్కో రైతు ధాన్యం తీసుకువచ్చి 20 రోజులు దాటుతోంది. కొన్ని కేంద్రాల్లో ఇంకా ధాన్యం కొనుగోలు ప్రారంభించలేదు. లారీల కొరత ఇబ్బంది పెడుతున్నది. లోడింగ్ అన్‌లోడింగ్ సమస్యగా మారింది. సరిపడా హమాలీలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మిల్లుల్లో ధాన్యాన్ని త్వరగా దింపుకోక పోవడంతో సమస్య మరింత జఠిలమవుతున్నది. కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం పేరుకు పోతున్నది. బస్తాలు అలానే ఉండిపోతున్నాయి.చాలా వరకు రైతుల ధాన్యం ఇంకా రోడ్లపైనే ఉంది. ట్యాబ్‌లో ఎంట్రీ అలస్యమవుతున్నది.కొంత మంది వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని మళ్లీ కొనుగోలు కేంద్రాల్లో పోసి ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### సన్నవడ్లు తెచ్చి వారం దాటింది

– పానగంటి విఠల్, కౌలు రైతు, చిన్నగొట్టిముక్ల, శివ్వంపేట మండలం, మెదక్ జిల్లా



శివ్వంపేట, నవంబర్ 12 : చిన్న గొట్టిముక్ల ఐకేపీ కొనుగోలు కేంద్రానికి సన్న ధాన్యం తీసుకువచ్చి వారం రోజులు దాటింది.10 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వరి సాగుచేశా. వారం రోజులుగా ధాన్యాన్ని బాగా ఎండబెట్టా. ధాన్యాన్ని కాంటా వేయమంటే ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతి రాలేదని చెబుతున్నారు. సన్నవడ్లకు బోనస్ అంటున్నారు కానీ ఇప్పటి వరకు ఎవరికీ ఇవ్వలేదు. ఒకవేళ వర్షం వస్తే పరిస్థితి ఏమిటి. ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల బాధలు అర్థంచేసుకోవాలి.



సిద్దిపేట వ్యవసాయ మార్కెట్‌లో తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలు



సిద్దిపేటలో షెడ్డు లేక ఎండలోనే భోజనం చేస్తున్న మహిళా రైతులు

## కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

- ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం తగదు
- సంగారెడ్డి అదనపు కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే చింతా



సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 12: నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి వివిధ అంశాలపై చర్చించేందుకు సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కలిశారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో ఎమ్మెల్యే వివిధ అభివృద్ధికి సంబంధించిన అంశాలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి నిర్లక్ష్యం తగదని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద బస్ షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. బస్సుల కోసం రోడ్డుపైనే పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొన్నదని వివరించారు. ప్రయాణికుల సౌకర్యం కోసం మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

## చేనేత కార్మికులకు అండగా నిలుద్దాం

- మాజీ ఎమ్మెల్సీ ఫరూక్‌హుస్సేన్



తువాలలు కొనుగోలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్

దుబ్బాక, నవంబర్ 12: చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి కార్మికులకు అండగా నిలుద్దామని మాజీ ఎమ్మెల్సీ ఫరూక్‌హుస్సేన్ పిలుపునిచ్చారు. నూతన గృహ నిర్మాణం పూర్తయిన సందర్భంగా ఆయన ఇంటికి వచ్చే అతిథులకు సన్మానం చేసేందుకు సిద్దిపేట, దుబ్బాక చేనే త కార్మికులు నేసిన 15 వందల తువాలలను మంగళవారం కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేనేత కార్మికులకు అండగా నిలిచిందన్నారు. చేనేత కార్మికులు నేసిన వస్త్రాలను కొనుగోలు చేయాలనే లక్ష్యంతో గులాబీ అధినేత కేసీఆర్ ప్రోత్సాహం అందించారని గుర్తుచేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చూపిన బాటలో నడుస్తూ చేనేత కార్మికులకు అండగా ఉండాలన్న లక్ష్యంతో వారు నేసిన వస్త్రాలను కొనుగోలు చేసినట్లు వివరించారు.

## పారిశుధ్య కార్మికుడి మృతిపై ఆందోళన

- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి
- రెండు గంటల పాటు ప్రధాన చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో
- ఎమ్మెల్యే, ఆర్డీవో హామీతో ధర్నా విరమించిన మున్సిపల్ కార్మికులు



బొల్లారం ప్రధాన చౌరస్తాలో పారిశుధ్య కార్మికులతో కలిసి ధర్నా చేస్తున్న నాయకులు



నిరసనకు దిగిన పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి

బొల్లారం, నవంబర్ 12: పారిశుధ్య కార్మికుడి మృతిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ తోటి కార్మికులు ధర్నాకు దిగారు. సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీలో రెండు రోజుల క్రితం 17వ వార్డు బాలాజీనగర్‌లో ఓపెన్ డ్రైనేజీలో చెత్తను తొలిగించేందుకు దిగిన పారిశుధ్య కార్మికుడు లంబాడి నరసింహ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మంగళవారం కార్మికుడి మృతి పై పారిశుధ్య కార్మికులంతా ఏకమై పాత మున్సిపల్ కార్యాలయం ప్రధాన చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ ధర్నాకు పలు కార్మిక సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారని, ఆ కుటుంబానికి అన్ని విధాలా న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఓ దశలో కమిషనర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. పారిశుధ్య కార్మికుల భద్రతపై కార్మిక నాయకులు వరప్రసాద్‌రెడ్డి, గుండ్ల మహేందర్‌రెడ్డి, ఆనంద్ కృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి నిరసనకారుల వద్దకు చేరుకొని శాంతించాలని సూచించారు. అనంతరం స్థానిక నాయకులతో చర్చించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చేలా చూస్తామని, మున్సిపల్ తరపున వచ్చే బెనిఫిట్స్ అందిస్తామన్నారు. కార్మిక నాయకులు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో జరిగిన ఘటన వివరించి ఆదుకోవాలన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ కేటాయించేలా కృషి చేస్తామన్నారు. ఈ వ్యవహారంపై మున్సిపల్ కౌన్సిల్‌లో ఆమోదం తెలుపుతూ తీర్మానం చేయాలని సూచించారు. దాదాపు రెండు గంటల పాటు ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన ధర్నా వల్ల ట్రాఫిక్ స్తంభించింది. ఎమ్మెల్యే, జిల్లా అధికారుల చొరవతో కుటుంబానికి న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ స్థానిక నాయకులు నిరసనకారులకు నచ్చజెప్పి ధర్నా విరమింప చేశారు. కార్యక్రమంలో కమిషనర్ మంగతాయారు, సీఐ గంగాధర్, మున్సిపల్ మేనేజర్లు మల్లికార్జున్, నిర్మలారెడ్డి, కౌన్సిలర్లు శ్రీకాంత్ యాదవ్, సాయి కిరణ్‌రెడ్డి, స్థానిక నాయకులు గుండ్ల మహేందర్‌రెడ్డి, రాజ్‌గోపాల్, కార్మిక సంఘాల నాయకులు నాగేశ్వరరావు, జై భీమ్ సభ్యులు, పారిశుధ్య కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.